www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 23 మే 2024

## 26న అండర్-16 పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు

**- జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డిప్రసాద్**

ప్రజాశక్తి - కడప

ఈ నెల 26వ తేదీన ఉదయం ఏడు గంటలకు కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో అండర్-16 పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్ ఒరిజినల్ తో పాటు ఒక సెట్టు జిరాక్స్ కాపీ తప్పనిసరిగా తీసుకొని రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా వైట్ డ్రెస్‌తో రావాలని తెలిపారు. ఎవరి క్రికెట్ కిట్ వారే తెచ్చుకోవాలని చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2008 సంవత్సరం సెప్టెంబర్ 1వ తేదీ తరువాత గాని లేదా 2010వ సంవత్సరం ఆగస్టు నెల 31వ తేదీ లోపు గాని జన్మించి ఉండాలని తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే వారు కచ్చితంగా నిర్ణీత సమయంలోగా స్టేడియానికి చేరుకోవాలని సూచించారు.

# చీనీ సాగుకు రైతులు విముఖత

- అధిక తెగుళ్లే ప్రధాన కారణం
- ఎండిపోతున్న తోటలు
- 'ఉపాధి' లబ్ధిదారులూ అనాసక్తి

తెగులుతో ఎండిపోయిన రెండు సంవత్సరాల చీనీ చెట్టు

ప్రజాశక్తి సింహాద్రిపురం

జిల్లాలో చీనీ తోటల పెంపకానికి ప్రసిద్ధిగాంచిన సింహాద్రిపురం మండలంలో నేడు ఆ పంట సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. ముఖ్యంగా చీనీ చెట్లు నాటినప్పటి నుంచి ఆరేళ్ల పాటు ఎటువంటి ఆదాయం లేకుండానే పెంచాల్సిన పరిస్థితి ఉంది. ఆ తర్వాత 20, 22 సంవత్సరాల పాటు పంట దిగుబడులు వస్తాయి. రెండేళ్లుగా చీనీ చెట్లకు విపరీతమైన తెగులు కారణంగా దిగుబడి రాకుండానే చనిపోతున్నాయి. ఈ చెట్లను బతికించడానికి అనేక రకాల పురుగుమందులను పిచికారి చేసిన ఎలాంటి ప్రయోజనం కనిపించకపోవడంతో రైతులు తోటలను వదిలేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పంట చేతికి వస్తుందన్న సమయంలో కన్నబిడ్డలా సాకిన చీనీ చెట్లు ఎలాంటి ఫల సాయం ఇవ్వకుండానే నిట్ట నిలువునా ఎండి పోతుండడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నియోజవర్గ వ్యాప్తంగా దాదాపు 27 వేల హెక్టార్లలో చీనీ చెట్లు సాగులో ఉన్నాయి. గడిచిన రెండు సంవత్సరాల కాలంలో నాలుగు వేల హెక్టార్లలో చనిపోయిన చీనీ చెట్లను తొలగించి వాటి స్థానంలో అరటి, బొప్పాయి లాంటి ఇతర ప్రత్యామ్నాయ పంటల వైపు ఆసక్తి చూపుతున్నారు.

**ఉపాధి హామీ పథకం లబ్ధిదారులు అనాసక్తి**

నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఏడాది దాదాపు 3 వేల ఎకరాలలో ఉపాధి హామీ పథకం ద్వారా చీనీ తోటల సాగుకు ప్రోత్సాహం ఇస్తున్నారు. దీని ద్వారా ప్రతి లబ్ధిదారునికి ఒక్కొక్క ఎకరాకు మూడు సంవత్సరాల కాలానికి సంబంధించి రూ.1.50 లక్షలు ఇస్తారు. చీనీ చెట్లకు తెగులు అధికం కావడంతో ఉపాధి హామీ పథకంలో లబ్ధిదారులు గుర్తించినప్పటికీ వారు చీనీ సాగుకు ముందుకు రావడంలేదని తెలుస్తున్నది.

**తెగుళ్ల గుర్తింపులో అధికారులు విఫలం**

ఇటీవల కాలంలో చీనీ చెట్లకు సోకిన తెగుళ్లను ఉద్యానవన శాఖ అధికారుల సైతం గుర్తించలేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పురుగుమందుల డీలర్లు సూచించిన అనేక రకాల మందులు పిచికారి చేసి వేల రూపాయలు డబ్బులు పోగొట్టుకున్న ఫలితం మాత్రం శూన్యమని రైతులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు దృష్టికి సైతం తీసుకెళ్లిన ఏం మాత్రం ప్రయోజనం లేదని రైతులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఉద్యాన శాఖ శాస్త్రవేత్తలు పరిశీలించి తెగులు నివారణకు మందులను సూచించాలని రైతులు కోరుతున్నారు.

**తెగుళ్లు కారణంగా చెట్లను తొలగించా**

రెండు సంవత్సరాల నుంచి చీనీ చెట్లకు విపరీతమైన తెగుళ్ల వచ్చాయి. రెండేళ్ల వయసు గల చెట్లను తొలగించా. తెగులు కారణంగా కాయలు కాపుకు రాని చెట్టు సైతం ఎండిపోతున్నాయి. అనేక మందులు కొట్టినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదు.

**- సుబ్బారెడ్డి, చీనీ రైతు, గురజాల.**

**చీనీ చెట్లు నాటడానికి ఆసక్తి లేదు**

గతంలో పులివెందుల ప్రాంతంలో ఉన్న చీనీ తోటలకు మంచి గుర్తింపు ఉండేది. తెగులు కారణంగా చీనిచెట్టు విపరీతంగా ఎండిపోతున్నాయి. అధికారులకు సూచించినప్పటికీ ప్రయోజనం కనిపించడం లేదు. చీనీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

**- మహేశ్వర, చీనీ రైతు, తెలికి.**

**ఉన్నతాధికారుల దృష్టికి సమస్య**

చీనీ చెట్లు మంజూరైన లబ్ధిదారులు నాటుకోవాలని సూచించినప్పటికీ తెగుళ్ల కారణంగా చనిపోతున్న విషయాన్ని తమ దృష్టికి తెచ్చారు. కొంతమంది రైతులు సాగుకు ఆసక్తి కనబరచడం లేదు. ఈ విషయాన్ని ఉద్యానవన శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

**- సుబ్బారెడ్డి, ఎపిడి, పులివెందుల.**

# కడపలో జగన్‌కు ఝలక్!

- డిప్యూటీ సిఎం ఓటమికి కుతంత్రం
- ఓ కీలక వైసిపి నాయకుని వెన్నుపోటు
- అదేబాటలో ఏడుగురు కార్పొరేటర్లు
- వెన్నుపోటుపై వైసిపిలో గుసగుసలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడపలో వైసిపి ఓటమికి కుతంత్రం నడిచింది. కడప అసెంబ్లీ అభ్యర్థి ఎస్‌బి.అంజాద్‌బాషా, పార్లమెంట్ అభ్యర్థి వైఎస్.అవినాష్‌రెడ్డికి వ్యతిరేకంగా కడపకు చెందిన ఓ కీలక నాయకుడి వెన్నుపోటు రాజకీయంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈయన సహకారంతో మరో ఏడుగురు కార్పొరేటర్లు సైతం టిడిపి ఎరకు లొంగిపోయినట్లు సమాచారం. ఫలితంగా కడప అసెంబ్లీపై ముస్లిం మార్క్ తొలగిం చడానికి సహకారం అందించినట్లు తెలుస్తోంది. ఫలితం గా కడప అసెంబ్లీలో వైసిపి గెలుపు కోసం పోటాపోటీ పరిస్థితి తీసుకు రావడం చర్చనీయాంశంగా మారింది.



కడప అసెంబ్లీ పరిధిలో 2.83 లక్షల ఓటర్లు ఉన్నారు. ఈ నెల 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో 65.27 శాతం నమోదైంది. కడప అసెంబ్లీ బరిలో వైసిపి తరపున డిప్యూటీ సిఎం ఎస్‌బి.అంజాద్‌బాషా, టిడిపి తరుపున మాధవి, కాంగ్రెస్ తరుపున అఫ్జల్‌ఖాన్ ప్రధాన పార్టీల తరుపున అభ్యర్థులుగా పోటీ పడిన సంగతి తెలిసిందే. కడప జిల్లా ఎన్నికల చరిత్రలో ఎన్నడూ ఎరగని విధంగా ముగ్గురి మధ్య తీవ్రమైన పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. వైసిపి నాయకుల వెన్నుపోటు, లొంగుబాటు కారణాలు కావడం విస్మయాన్ని కలిగిస్తోంది.

**రచ్చ గెలవడంలో డిప్యూటీ సిఎం ఎదురీత**

సార్వత్రిక ఎన్నికల టికెట్‌ను దక్కించుకోవడంలో ఇంటిపోరు గెలిచిన డిప్యూటీ సిఎం.అంజాద్‌బాషా, వీధిపోరును గట్టెక్కడంలో ఎదురీదుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆయనకు సన్నిహితుడైన ఓ కీలక వైసిపి నాయకుని వెన్ను పోటు కారణంగానే గెలుపు కోసం పోరాటం చేయాల్సిన దుస్థితి దాపురించిందనే చర్చ నడుస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 53 వేల ఓట్లపైచిలుకు గెలిచిన నాయకుడు, 2024 సార్వత్రిక ఎన్నికల్లో వెన్నుపోట్ల కారణంగా పోరాటం చేయాల్సిన రావడం గమనార్హం.

**వెన్నుపోట్లు...లొంగుబాట్లు**

వైఎస్ జగన్ రెండవ టర్మ్‌లో ముఖ్యమంత్రిగా కొనసాగడానికి ప్రతి సీటు కీలకం. ఇటువంటి సంగతి తెలిసినప్పటికీ కడప నగరానికి చెందిన సదరు నాయకుడు, ఓ అధికారి మధ్య వర్తిత్వంతో ప్రత్యర్థితో డీల్ కుదుర్చుకుని వెన్నుపోటుకు తెర తీశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంతటితో ఆగకుండా మరో ఏడుగురు కార్పొరేటర్లు సైతం ప్రత్యర్థికి లొంగి పోయి సైలెంట్‌గా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. సదరు నాయకుడు పార్టీలోనూ, పార్టీయేతర కీలక పదవిలోనూ కొనసాగుతూ ఇలా చేయడమేమిటనే చర్చ నడుస్తోంది. ఫలితంగా సదరు కీలక నాయకుడి పరిధి లోని ఓ సామాజికవర్గపు ఓటర్లు టిడిపి అభ్యర్థి వైపు మొగ్గు చూపిస్తున్నారని తెలిసినప్పటికీ ప్రేక్షకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. లొంగుబాటు నాయకులు జగన్‌కు ఝలక్ ఇచ్చినట్లు అవుతోందనే వాదన వినిపిస్తోంది. కడప అసెంబ్లీ పరిధిలో ప్రభావిత సామాజిక వర్గాలైన ముస్లిమ్, క్రిస్టియన్ ఓటర్లను ప్రత్యర్థులైన టిడిపి, కాంగ్రెస్ కొల్లగొట్టే ప్రయత్నం చేయడం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో బాధ్యులైన సదరు వైసిపి నాయకులు కలిసి కట్టుగా శ్రమించాలి. ఎటువంటి ప్రయత్నమూ చేయకుండా, పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలి. ఇటువంటి ప్రయత్నాలు చేయకుండా ప్రత్యర్థుల ఎరకు లొంగిపోయి, పార్టీకి, వైఎస్.జగన్ ముఖ్యమంత్రి అవకాశానికి వెన్నుపోటు పొడవడం చర్చనీయాంశంగా మారింది.

# విశిష్టమైన కవిత్వాన్ని ఆవిష్కరించిన 'వేటూరి'

**- ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి**

ప్రజాశక్తి-కడప అర్బన్

వేటూరి సుందర రామమూర్తి అత్యంత ప్రతిభావంతుడైన కవియని, తెలుగు సినిమా పాటల్లో ఆయన విశిష్టమైన కవిత్వాన్ని పండించారని, సినిమా పాటల్లో ఆయన రాసినంత గొప్ప కవిత్వం మరొకరు రాయలేదని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జురెడ్డి అన్నారు. వేటూరి వర్ధంతిని పురస్కరించుకొని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం బుధవారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్బులో వేటూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ వేటూరి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో ఓసీత కథ ద్వారా సినిమా రంగానికి పరిచయమై వేలాది పాటలు రాసి గొప్ప కీర్తి నార్జించారన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ పదాల పొందికలోను, బావుకతలోనూ ఆయన పాటలు ఎంతో బాగుంటాయని, సాగర సంగమం, శంకరాభరణం సినిమాల్లో పాటలు ఆయనకు అజరామరణమైన కీర్తిని తెచ్చాయని పేర్కొన్నారు. ప్రసిద్ధ రంగస్థలం నటుడు ఎ.విశ్వనాధ్‌రెడ్డి మాట్లాడుతూ అడవి రాముడు, మల్లెపువ్వు, సిరిసిరిమువ్వ, సప్తపది, సీతాకోకచిలుక, స్వాతిముత్యం, సితార, మేఘసందేశం సినిమాల్లో వేటూరి గొప్ప పాటలు రాశారన్నారు. మరో రంగస్థల నటుడు ఎ.గంగయ్య మాట్లాడుతూ వేటూరిని ఆరు నంది పురస్కారాలు వరించాయని, ఆయన మరెన్నో ఉత్తమ పురస్కారాలు అందుకున్నారన్నారు. కార్యక్రమంలో మందల మురళి, తిప్పలూరు ఓబులేసు, వీరదాసరి ప్రకాశం, జ్యోతి జార్జి, బి.బాలఓబయ్య ఎ.గంగయ్య, తపలిస్ట్ గంగయ్య, టి.నారాయణయాదవ్ పాల్గొన్నారు.

వేటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు, కళాకారులు

# నిత్య చైతన్య సాహితీమూర్తి 'కేతు'

ప్రజాశక్తి-కడప అర్బన్

తెలుగు సాహితీ లోకంలో కథకునిగా, నవలా కారునిగా, నాటక కర్తగా, పరిశోధకునిగా, సంపాదకునిగా, నిరంతర సృజనశీలిగా, నిత్య చైతన్య సాహితీ మూర్తిగా కేతు విశ్వనాథరెడ్డి తన సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగించారని యోగి వేమన పాలక మండలి సభ్యులు, వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మొదటి వర్ధంతిని పురస్కరించుకుని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దనరాజు ఆధ్వర్యంలో బుధవారం సంస్మరణ సభను నిర్వహించారు. తొలుత ఆచార్య కేతు చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా గ్రామ నామాలను ఆయా గ్రామాల్లో ఉన్న జీవన విధానాన్ని నిశితంగా పరిశీలించి గొప్ప పరిశోధనచేసి కేతు పలువురి ప్రశంస లందుకున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ తాను పుట్టిన నేలకు తన చుట్టూ పెరిగిన సమాజానికి గొంతుకగా మారి రాయలసీమ కథకు చుక్కానిగా నిలిచారని, ఆయన కథలు దీన, దళిత శ్రామిక వర్గాల ప్రతినిధిగా నిలిచారని అన్నారు. రాయలసీమ టూరిజం సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు మాట్లాడుతూ కేతు తన కథల్లో చెప్పదలచుకొన్న అంశాన్ని సూటిగా, స్పష్టంగా చెబుతారని ఆయన నిజ జీవితంలో కూడా ఎవరు ఏమనుకొన్నా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుతారని తెలిపారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకొన్నారు. డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి మాట్లాడుతూ కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యాన్ని అనేక భాగాలుగా విభజించి తను సంపాదకునిగా సారథ్యం వహించి సంపాదకత్వానికే ఒక నూతన ఒరవడిని సృష్టించాడని అన్నారు. ప్రసిద్ధ రంగస్థల నటుడు మధు మాట్లాడుతూ కేతు సార్వత్రిక విశ్వ విద్యాలయంలో తెలుగు భాషా సాహిత్యాలకు చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మూల అయ్యవారురెడ్డి, డేవిడ్, గొబ్బూరి కోటేశ్వరరావు, విజయ్, సతీష్, బాబు, జ్యోతి జార్జి పాల్గొన్నారు.

కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

## 26న నెలనెలా సీమ సాహిత్యం

ప్రజాశక్తి కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 132వ సదస్సును ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసా దరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 132వ సదస్సులో 'రాయల సీమ నదీ సాహిత్యం' (మొదటి ప్రసంగం)' అనే అంశంపై సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు పరిశోధన కేంద్రంలో సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

## 24 నుంచి 'పది' అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

**- జిల్లా విద్యా శాఖాధికారి ప్రకాష్‌రెడ్డి**

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగు తాయిన్నారు. ఈ పరీక్ష జిల్లాలోని 23 సెంటర్లలో ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షకు 5338 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 8.30 గంటల లోపల చేరుకోవాలన్నారు. 9.30 గంటల తర్వాత వచ్చిన విద్యా ర్థులను పరీక్షా కేంద్రాలకు అనుమతి లేదన్నారు. పరీక్షకు హాజరవు విద్యార్థులు నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు ఎటువంటి సందర్భంలో కూడా డిజిటల్ ఇన్స్ట్రుమెంట్స్, మొబైల్ ఫోన్స్ అనుమతి లేదన్నారు. కావున విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఎటువంటి సందర్భంలో మొబైల్ ఫోన్స్ తీసుకొని రాకూడదు పేర్కొన్నారు. విద్యార్థులు ఎటువంటి స్లిప్పులు గాని, ఏ ఇతర వస్తువులు గాని తీసుకొని రాకూడదని పేర్కొన్నారు. ఈ పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్ సూచనల మేరకు డిస్టిక్ రెవెన్యూ ఆఫీసర్ అన్నమయ్య జిల్లా వారి ఆధ్వర్యంలో పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, ఆర్టీసీ డిపార్మెంట్, మెడికల్ అండ్ హెల్త్ డిపార్మెంట్ ఇతర జిల్లా అధికారులతో ఏర్పాట్ల గురించి సమన్వయం చేశామని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రానికి దగ్గర్లో ఉండే జిరాక్స్ సెంటర్స్ కూడా మూసివేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థుల కోసం వైద్య శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. కావున విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని తెలిపారు.

అన్నదానం చేస్తున్న పోతుగుంట రమేష్ నాయుడు

## అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నదానం గొప్పదని లయన్స్ క్లబ్ ఆఫ్ రాజంపేట, విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు తెలియజేశారు. రమేష్ నాయుడు తల్లి పోతుగుంట లక్షుమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం పాత బస్టాండు కూడలిలో పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్పవారి విగ్రహాలకు దండ వేసి గొప్పలుపోయే దానికన్నా ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టి ఆకలి తీర్చడం వివేకమని అన్నారు. శ్రీమంతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పేదల ఆకలి తీర్చేందుకు ముందుకొచ్చి అన్నదాన కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పట్టుపోగుల ఆదినారాయణ, హరిప్రసాద్, సూర్యచంద్ర, రేణు ప్రసాద్ రాజు, జి.కె నాగరాజు, లయన్స్ క్లబ్ సభ్యులు వెంకటసుబ్బయ్య, షేక్ అబ్దుల్లా, మద్దిపట్ల రామకృష్ణ నాయుడు, మారత వెంకటసుబ్బయ్య, వై.సుబ్రహ్మణ్యం రాజు, దండే రవికుమార్ పాల్గొన్నారు.

## ఆ బిఇడి కళాశాలకు వైవీయూ గుర్తింపు లేదు

ప్రజాశక్తి - కడప అర్బన్

వైయస్సార్ జిల్లా పరిధిలోని ప్రొద్దుటూరు శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఉన్న శ్రీ మలయాళ స్వామి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బిఇడి)కు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి నేటి వరకు యోగి వేమన విశ్వవిద్యాలయం నుంచి ఎలాంటి గుర్తింపు (అఫిలియేషన్) లేదని విశ్వవిద్యాలయ కాలేజీ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య కె.రఘుబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదరు కళాశాలలో బిఇడి ప్రవేశాలు పొందే విద్యార్థులకు విశ్వ విద్యాలయం ఎలాంటి బాధ్యత వహించదని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో న్యాయ స్థానాల మార్గదర్శకం మేరకు విశ్వవిద్యాలయ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

## డ్రెయినేజీ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-కడప అర్బన్

కార్పొరేషన్ కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ మార్నింగ్ విజిట్‌లో భాగంగా బుధవారం గురుకుల విద్యాపీఠ్, డిస్టిక్ కోర్ట్, మహా ప్రస్థానం బురియల్ గ్రౌండ్, మున్సిపల్ స్టేడియం వర్క్స్, ఎస్‌బిఐ కాలనీలలో జరుగుతున్న స్టామ్ వాటర్ డ్రైన్ పనులను ఇంజినీరింగ్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. గురుకుల విద్యాపీఠ్ స్టోమ్ వాటర్ వర్క్స్ పనులను పరిశీలించి డ్రైన్, రోడ్డు మధ్య గ్యాప్స్ రిస్టోరేషన్ చేయు విధంగా చర్యలను చేపట్టాలని కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు.

## డిఇడి స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశాలు

ప్రజాశక్తి-కడప అర్బన్

హెలెన్ కెల్లర్ కాలేజీ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కడపలో డిఇడి స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి.దౌలత్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాచే గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. కోర్సులో చేరుటకు ఇంటర్మీడియట్ లేదా సమామానమైన కోర్సులో ఒసిలు 50 శాతం బిసి, ఎస్‌సి, ఎస్‌టి, పిహెచ్ విద్యార్థులు 45 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. బిఇడి స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు చేసిన వారు చెవిటి, మూగ బాల బాలికల ప్రత్యేక పాఠశాలలు, కళా శాలలు ఇంక్లూజివ్ స్కూల్స్ భవిత కేంద్రాలలో ఉపాధ్యాయులుగా పనిచే యుటకు అర్హులవుతారని పేర్కొన్నారు. కోర్సులో చేరదలచిన వారు జూన్ 14లోగా దరఖాస్తులను హెలెన్ కిల్లర్ కాలేజీ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకషన్, రాజీవ్ గృహకల్ప రోడ్, సెంట్రల్ జైలు దగ్గర, రామాంజనేయ పురం, కడపలో లభిస్తాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9966006758, 9849311680 సెల్ నంబర్ సంప్రదించాలని పేర్కొన్నారు.

## 'మిట్స్'లో ఘనంగా అంతర్జాతీయ 'హెచ్ఆర్' దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీర్ కళాశాలలో అంతర్జాతీయ హెచ్ఆర్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ శ్రీమంత బసు మాట్లాడుతూ ఈ సంవత్సరం థీమ్ షేపింగ్ ది న్యూ ఫ్యూచర్ అని అన్నారు. సమగ్రమైన, అంగీకరించే, స్థిరమైన పని భవిష్యత్తును నడిపించడంలో ప్రతి హెచ్ఆర్ కీలకమైన పాత్ర వహిస్తారని అన్నారు. ఒక సంస్థ లోని ఉద్యోగులు ఎదగడానికి, వారు అభివృద్ధి చెందడానికి పని వాతావరణాన్ని సృష్టించే ప్రధాన వ్యక్తి ఒక హెచ్ఆర్ మాత్రమేనని అన్నారు. హెచ్ఆర్ నిపుణులు ఉద్యోగుల నియామకం నుంచి బోర్డింగ్ వరకు సున్నితమైన అనుభవాన్ని కలిగి ఉంటారని విద్యార్థులు ఈ విషయాలను గ్రహించాలని కోరారు. ఎటువంటి వ్యాపారమైన విజయవంతం చేయడానికి హెచ్ఆర్ నిపుణులు తమ సంస్థాగత, ఉద్యోగి అవసరాలు రెండింటినీ ఎలా సమన్వయం చేస్తారో విద్యార్థులు తెలుసుకోవాలని అన్నారు. కార్యకమంలో ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ గీతాదేవి, ప్రొఫెసర్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీమంత బసు

## నేడు పాలీసెట్ కౌన్సెలింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూల్‌లో గురువారం పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియపై అవగాహన కార్యక్ర మం నిర్వహిస్తున్నామని శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలీసెట్ కౌన్సెలింగ్‌కు హాజరగు విద్యార్థులకు అవసరమగు సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్, పాలిటెక్నిక్ కోర్సులో గల బ్రాంచ్‌లు, వాటి ప్రాముఖ్యత, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, విభాగాలు, కళాశాలల ఎంపిక వంటి అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పిస్తామని అన్నారు. రాయచోటి పట్టణ, పరిసర ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9100040193 నంబరును సంప్రదించాలని తెలిపారు.

## ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి**

ప్రజాశక్తి- వేంపల్లె



ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి కోరారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో ఆరోగ్యశ్రీ పథకం అనారోగ్య శ్రీ పథకంగా తయారైందని విమర్శించారు. పేరుకే నవరత్నమని ఆచరణలో నకిలీ నవరత్నమని ఎద్దేవా చేశారు. ఆరోగ్యశ్రీ కాంగ్రెస్ మానస పుత్రిక అన్నారు. పేదలకు కూడా ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో 2007లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించిందన్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేశాయన్నారు. ఎంతో మంది రోగులు చావు అంచులకు పోయి పునర్జన్మ పొందినట్లు చెప్పారు. కానీ దురదృష్టవశాత్తూ జగన్ పాలనలో ఆరోగ్యశ్రీ పథకం సరిగ్గా అమలు కాలేదని తెలిపారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదన్నారు. దీంతో ఆ ఆసుపత్రులు ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నట్లు చెప్పారు. గత ఆగస్టు నుండి బిల్లులు చెల్లించకపోవడంతో ఆసుపత్రుల్లో పని చేసే సిబ్బందికి జీతాలు ఇవ్వలేక పోతున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిపి వేయడంతో ఎంతో మంది రోగులు తమ ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే బిల్లులు చెల్లించి ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. రోగుల ప్రాణాలు కాపాడాలని తులసిరెడ్డి కోరారు.

## ఆరోగ్యకర జీవితానికి సురక్షిత నీరు అవసరం

ప్రజాశక్తి-పీలేరు

మనకు ఆరోగ్యవంతమైన జీవితం సురక్షిత నీరు, తాజా ఆహారంతోనే సాధ్యమని తలుపుల పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎం.రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం గాండ్లపల్లిలో ప్రజలకు 'సురక్షిత నీరు-ఆరోగ్యానికి మేలు' అనే అంశంపై డాక్టర్ తన వైద్య బృందంతో కలిసి అవగాహన కల్పించారు. ప్రతికూల వాతావరణ మార్పు, అధిక వర్షాలకు నీళ్లవిరేచనాలు, కలరా, టైఫాయిడ్, పచ్చకామెర్లు, జిగట విరేచనాలు, పోలియో మొదలగు అంటువ్యాధులు చుట్టుముట్టే అవకాశం ఉందని తెలిపారు. అంటు వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే నీటిని కాచి, వడగట్టి, చల్లార్చిన నీటిని శాస్త్రీయ పద్ధతిలో క్లోరినేషన్ విధానంలో శుద్ధి చేసిన నీటిని తాగాలని, తాజా ఆహారం భుజించాలని, ఈగలు వాలిన పదార్థాలు తినకూడదని, భోంచేసే ప్రతిసారీ చేతులను సబ్బుతో రుద్ది కడగాలని, పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత విధిగా పాటించాలని డాక్టర్ రమేష్ రెడ్డి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఇ కొండయ్య, ఎఎన్ఎం రేణుక, సిహెచ్‌ఒలు రాజేశ్వరి, వెంకటరత్నం, సుధ, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ జవహర్‌బాబు

## వ్యాక్సినేషన్ తనిఖీ

**ప్రజాశక్తి- కలకడ**

మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాపిరెడ్డిగారిపల్లి సచివాలయంలో డాక్టర్ పి.జోహార్ బాబు ఆధ్వర్యంలో రెగ్యులర్ అవుట్ రిచ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ వ్యాక్సినేషన్ రిజిష్టర్లు, వ్యాక్సిన్ క్యారియర్‌లోని వ్యాక్సిన్‌ను గర్భిణులు, బాలింతల ఎంసిపి కార్డులను పరిశీలించారు. అందులో లోపాలను గుర్తించి సరి చేసుకోమని ఆరోగ్య కార్యకర్తకు తగు సూచనలు ఇచ్చారు. వ్యాక్సిన్ వేసిన పిల్లలు మరల ఎప్పుడు రావాలి, ఎంత మోతాదు వ్యాక్సిన్ వేయించుకోవాలనే అనే వివరాలు ఎంసిపి కార్డులో పొందు పరచాలని తెలిపారు. పెంట వ్యాక్సిన్, రోటా వ్యాక్సిన్, మేజిల్స్ వ్యాక్సిన్, టిటి వ్యాక్సిన్, కంటి జబ్బులు రాకుండా మందులను అందించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య, పిహెచ్ఎన్ కె.సుబ్బరత్న, ఆరోగ్య కార్యకర్త ఎన్.వాణి, ఆశా కార్యకర్తలు టి.గురు శాంత, ఎం.రేష్మా బేగం, రవణమ్మ, పార్వతి పాల్గొన్నారు.

## ఘనంగా మండెం లక్ష్మీ నరసింహస్వామి జయంతి

**ప్రజాశక్తి-చిన్నమండెం**

మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం జిల్లావాండ్లపల్లె దగ్గర మాండవ్య నది ఒడ్డున వెలసినటువంటి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నరసింహ స్వామి జయంతి ఘనంగా నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తాదులకు తీర్థప్రసాదాలను అందించినట్లు పేర్కొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

**ప్రజాశక్తి-కలికిరి**

కాలువను శుభ్రం చేస్తున్న కార్మికులు

స్థానిక మండలంలోని మరికుంటపల్లి గ్రామ పంచాయతీలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సర్పంచ్ రెడ్డిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా మర్రికుంటపల్లి గ్రామపంచాయతీ కొత్త గజ్జల వండ్లపల్లెలో మురికినీటి కాలవలు శుభ్రం చేయించి, వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను శుభ్రం చేసి మురికినీటి కాలవల వెంబడి బ్లీచింగ్ చల్లించినట్లు పేర్కొన్నారు. రాబోవు వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని అంటువ్యాధుల ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాయత్రి పాల్గొన్నారు.

## హార్సిలీహిల్స్‌లో అరుదైన పునుగుపిల్లి దర్శనం

కమ్మికి చిక్కుకున్న పునుగు పిల్లి

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ అటవీ ప్రాంతంలో బుధవారం అరుదైన అటవీ జాతికి చెందిన పునుగుపిల్లి ఉదయం అటవీ ప్రాంతంలో దర్శనమిచ్చింది. కమ్మీకి చిక్కుకొని ఉన్న పునుగుపిల్లి స్థానికులు గుర్తించారు. వెంటనే అక్కడ ఉన్న పర్యాటక సిబ్బంది పునుగుపిల్లిని కమ్మి నుంచి విడిపించి అడవిలోకి వదిలేశారు. అరుదుగా కనిపించే ఈ పునుగుపిల్లి చాలా విశిష్ట లక్షణాలను కలిగి ఉంటాయని, వీటిలో 38 రకాల జాతులు ఉన్నాయని హార్సిలీహిల్స్ మేజేజర్ సెల్విన్‌రెడ్డి తెలిపారు. వీటి తైలాన్ని తిరుమలలోని శ్రీవారి అభిషేకానికి వాడటం జరుగుతుంది. శ్రీచందనం, ఎర్రచందనం చెట్లకు ఈ పునుగుపిల్లి తన ఒంటిని రుద్దుతుంది,ఆ సమయంలో ఏర్పడిన ద్రవ పదార్థమే పునుగుతైలమని అన్నారు. ఇది విసర్జించిన గింజలతో కాఫీ తయారీలో వాడు తారని ఇది చాలా ఖరీదని చెప్పారు.అంతరించిపోతున్న ఈ జాతి మళ్ళీ కనిపిం చడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతరించిపోతున్న అటవీ సంప దను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ఆయన పేర్కొన్నారు.

## అంధకారంలో కలకడ

### విద్యుత్‌కు అంతరాయం

### ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు

**ప్రజాశక్తి-కలకడ**

మండల కేంద్రమైన కలకడతో పాటు చుట్టు పక్కల గ్రామాలు విద్యుత్ అంతరాయంతో మంగళవారం రాత్రి అంధకారంలో గడిపాయి. ఉక్కపోతతో ప్రజలు అల్లాడి పోయారు. ట్రాన్స్‌కో కార్యాలయ పరిసర ప్రాంతాలలో ట్రాన్స్ ఫార్మర్లు మరమ్మతుకు గురి కావడంతో వాటిని సకాలంలో సరిచేయకపోవడం ఇలాంటి దుస్థితి ఏర్పడిందని పలువురు విమర్శిస్తున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి విద్యుత్తు రావడం, పోవడం ఇలా పలుమార్లు జరగడంతో వల్ల గృహల్లోని టివిలు, ఫ్యాన్లు, ఎసిలు కాలిపోయే పరిస్థితి వచ్చిందని ప్రజలు చెబుతున్నారు. యంత్రాలు మరమ్మతుకు గురైన వెంటనే స్పందించి వాటిని మరమ్మతు చేయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత ట్రాన్స్‌కో అధికారులపై ఉందన్నారు. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడటంతో పిల్లలు, వృద్ధులతో ఇంటిల్లాపాది ఉక్కపోతకు గురై రాత్రంతా జాగారం చేయవలసిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి రాత్రి వేళల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

### రెండు గంటలు విద్యుత్ నిలిపివేశాం : ట్రాన్స్‌కో ఎఇ

మండల కేంద్రమైన కలకడలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురి కావడంతో రెండు గంటల పాటు విద్యుత్తు అంతరాయం జరిగిందని ట్రాన్స్‌కో ఎఇ వరప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వేకుజమున 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం వాస్తవమేనని అన్నారు. విద్యుత్తు రావడం, పోవడం వల్ల గృహాల్లో ఎలక్ట్రానిక్ సామగ్రికి ఎటువంటి నష్టం వాటిల్లలేదని అన్నారు.

## వేరుశనగ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి-వాల్మీకిపురం**

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశెనగ విత్తన కాయలు సిద్ధంగా ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఎఒ హేమలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 1730 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు కేటాయించిందని, కావాల్సిన రైతులు ముందుగా రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. 30 కిలోల కె6 ధర రూ.1710, నారాయణి రకం ధర రూ.1746 అని తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తీసుకెళ్లి సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పంపిణీకి సిద్ధంగా ఉన్న వేరుశనగ విత్తన కాయలు

# పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

### - జీవవైవిధ్య అవార్డు గ్రహీత సూరం శ్రీదేవి

**ప్రజాశక్తి-రామాపురం**

మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని జీవ వైవిధ్య పరిరక్షణ అవార్డు గ్రహీత సూరం శ్రీదేవి పేర్కొన్నారు. ప్రపంచ జీవ వైవిధ్య పరిరక్షణ దినోత్సవ సందర్భంగా బుధవారం మండలంలోని వ్యవసాయానికి యోగ్యం కాని బీడు బంజరు భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ మనుగడకు జీవనాధారం మొక్కలేనని, మొక్కలు లేనిదే మానవ జీవితం కడు దుర్భరం అవుతుందని మొక్కలు విరివిగా నాటడం వల్ల జీవకోటికి ప్రాణవాయువు పుష్కలంగా లభిస్తుందని అన్నారు. భూమి మీద ఉండే చెడు వాయువులను మొక్కలు పీల్చి శుద్ధి చేయడంలో ఎంతగానో సహాయ పడతాయని పేర్కొన్నారు. భూమి మీద ఆక్సిజన్ పెరిగి కార్బన్‌డైఆక్సైడ్ శాతం తగ్గాలన్నా మొక్కలే కారణమని వీటిని విరివిగా పెంచడం వలన ఆరోగ్యం జీవనశైలి సులభతరం అవుతుందని చెప్పారు. ప్రకృతి విపత్తులకు కారణం జీవవైవిధ్యంలో తేడా రావడం వలననే సునామీలు భూకంపాలు, ఓజోన్ పొర దెబ్బ తినడం లాంటివి జరిగి పెద్ద ఎత్తున ప్రాణా నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. జీవ వైవిధ్యం పై శ్రద్ధ చూపి ఖాళీగా ఉన్న బీడు, బంజరు భూముల్లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద, గుట్టలు, కొండల వాగులు వంకలు, కొండ వాలు వద్ద మనిషికొక చెట్టు, ఊరికి ఒక వనం లాగా నడుంబిగించి హరిత ప్రపంచంగా తీర్చిదిద్దినప్పుడే పర్యావరణాన్ని పరిరక్షించగలుగుతామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ సూరం వెంకట్రామిరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.**వాల్మీకిపురం:** అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ మన దేశంలో

గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటుతున్న సూరం శ్రీదేవి

జీవవైవిధ్యంపై ఆధారపడి 60శాతం మంది బతుకుతున్నట్లు ఒక అంచనా ఉందన్నారు. మనం ప్రకృతిని అవసరానికి మించి వాడటం గాని, వనరుల్ని దుర్వినియోగం చేయడం గాని, వికృతమైన జీవన విధానం అవలంభించడం గాని వదిలివేయాలని, మనిషి జీవనశైలిని ప్రకృతికి అనుగుణంగా మార్చుకోవాలని, రసాయనాల వాడకం తగ్గించి జంతువులను, మొక్కలను పరిరక్షించుకొని జీవవైవిధ్యాలను కాపాడుకోవాలన్నారు. ఇటీవల జన్యుమార్పిడి కూడా జీవ వైవిధ్యాన్ని భారీగా దెబ్బతీస్తోందన్నారు. మనవంతు బాధ్యతగా రసాయన కాలుష్యాన్ని అరికట్టి భూతాపాన్ని తగ్గించడం, జంతువులను, మొక్కలను పరిరక్షించడం, ప్లాస్టిక్ వడకాన్ని తగ్గించి జనపనార సంతులను వాడటం చేయాలన్నారు. అడవులు, జీవ, జల రాశులను ఇప్పటికైనా పరిరక్షించుకోనట్లయితే రాబోయే రోజుల్లో మానవజాతి మనుగడకే ముప్పు తప్పదని, అంతరిస్తున్న జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం మన అందరి బాధ్యత అని తెలిపారు.

## మంత్రి 'పెద్దిరెడ్డి'ని కలిసిన వైసిపి నాయకులు

మంత్రి పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వైసిపి నాయకులు

**ప్రజాశక్తి-పీలేరు**

పీలేరు వైసిపియువ నాయకులు, అన్నమయ్య జిల్లా పంచాయతీరాజ్ అభివృద్ధి మండలి సభ్యులు డాక్టర్ షేక్ హబీబ్ బాష రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి ముందస్తు విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన తిరుపతిలో మంత్రిని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే పీలేరు, కెవి పల్లి మండలాల వైసిపి ఎన్నికల బాధ్యులు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డిని కలిసి ఆయనకు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా హబీబ్ బాషా మాట్లాడుతూ పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మరో మారు ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించి చరిత్ర తిరగరాయను న్నారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అలాగే పీలేరు, కెవి పల్లి మండలాల వైకాపా ఎన్నికల బాధ్యుడిగా పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి పరిణతి చెందిన నాయకుడిగా తన రాజకీయ చతురతను ప్రదర్శిస్తూ అటు నాయకులను, ఇటు ప్రజలను ఆకట్టుకుంటూ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం నుంచి వైకాపా ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన చింతల రామచంద్రారెడ్డిల గెలుపుకు విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీలేరు గ్రామపంచాయతీ వార్డు సభ్యులు ఆబిద్, ఏఎంసి డైరెక్టర్ మునీర్, ఎస్సీ నాయకులు మణి పాల్గొన్నారు

## పకడ్బందీగా ఓట్ల లెక్కింపు : కలెక్టర్

**ప్రజాశక్తి-రాయచోటి**

జూన్ 4న జరగబోయే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక రాయచోటిలోని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాయచోటి, రాజంపేట, మదనపల్లి ఆర్‌డిఒలు, వివిధ నోడల్ అధికారులతో జూన్ 4వ తారీఖున జరగబోయే ఓట్ల లెక్కింపు ప్రక్రియ పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమాల ప్రకారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగాలని అధికారులను ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పగడ్బందీగా ఏర్పాటు చేసుకోవాలని, కౌంటింగ్ కేంద్రంలో పనిచేయబోయే సూపర్వైజర్లు, ఇతర సిబ్బందికి అవసరమైన శిక్షణ తరగతులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు ప్రత్యేక తరగతులు నిర్వహించి సిబ్బందికి ఎటువంటి సందేహాలు లేకుం డా చూడాలన్నారు. రౌండ్ల వారీగా ఫలితాలను త్వరితగతిన

సమావేశంలో మాట్లాడుతున్న అభిషిక్త్ కిషోర్

ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ సత్యనారాయణరావు, నోడల్ అధికారులు, ఎలక్షన్స్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కౌంటింగ్ రోజున అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట: మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

అసలే ఎన్నికల వాతావరణం.. ఓట్ల లెక్కింపు అనంతరం అల్లర్లు జరిగే అవకాశం ఉందన్న ఇంటిలిజెన్సీ హెచ్చరికలతో పోలీసులు కార్డెన్ సెర్చ్ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పోలీసులందరూ స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన మాక్ డ్రిల్ కు భారీగా హాజరయ్యారు. ఆ హడావుడిని అక్కడ దృశ్యాన్ని చూసి ఏం జరిగిందని ఏం జరుగుతుందన్న గుబులు స్థానికుల్లో ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల్లో, సిబ్బందిలో నెలకొంది. చివరకు పోలీసులు నిర్వహించిన మాబ్ ఆపరేషన్, మాక్ డ్రిల్ అని తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఏవైనా అవాంఛనీయ సంఘటనలు హింసాత్మక చర్యలు చోటు చేసుకున్న అల్లర్లు చేస్తున్న సమయాల్లో పోలీసులు ఎలా స్పందించాలి, జన సమూహాలను ఎలా నియంత్రించాలి అనే అంశాలను డెమో ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమాన్ని పరిశీలించిన డిఎస్‌పి చైతన్య మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అల్లరి మూకలను అణచివేసేందుకు అత్యవసర సమయాల్లో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మన్నూరు సిఐ రవీంద్రనాథ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ రోజు,అనంతరం పోలీసులు అప్రమత్తంగా ఉండాలని డిఎస్‌పి చైతన్య పేర్కొన్నారు. పట్టణంలోని టోల్‌గేట్ సెంటర్ వద్ద పోలీసు సిబ్బంది ప్రత్యేక దళాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. కౌంటింగ్ రోజున రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎలాంటి సంఘటనలకు పాల్పడకూడదని అలా పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరోజు తీసుకోబోయే చర్యలను మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు చూపించారు. కార్యక్రమంలో సిఐలు సురేంద్ర నాథ్‌రెడ్డి, టి బాబు, ఎస్ఐలు డాక్టర్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.**రామాపురం :** జూన్ 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాల దృష్ట్యా అల్లర్లు దౌర్జన్యాలు లాంటి చర్యలకు పాల్పడితే అలాంటి వారిపై పోలీసుల చర్యలు తప్ప వని లక్కిరెడ్డిపల్లి సిఐ జీవన్ గంగాధర్‌బాబు హెచ్చరించారు. మండలంలోని సమస్యాత్మకమైన గ్రామాలైన సుద్దమల్ల పంచాయతీ దూదేకులపల్లి కల్పనాయుని చెరువు గ్రామంలో బుధవారం రామాపురం ఎస్ఐ లక్ష్మీ ప్రసాద రెడ్డి ఆధ్వర్యంలో బిఎస్ఎఫ్ కేంద్ర బలగాలతో నాకాబంది నిర్వహించారు. ఎన్నికల ఫలితాల రోజున గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని, ఒకసారి రౌడీషీటర్‌గా పోలీస్ స్టేషన్ నమోదైతే జీవితాంతం తీసివేయడం జరగదని హెచ్చరించారు.

### 80 లీటర్ల నాటుసారా స్వాధీనం

**వాల్మీకిపురం:** జూన్ 4వ తేది వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, గ్రామాల్లో ఎక్కడైనా ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని వాల్మీకిపురం సిఐ పులిశేఖర్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని చింతపర్తిలో కార్డెన్ సర్చ్ నిర్వహించి, బిఎస్ఎఫ్ బలగాలు, స్థానిక పోలీస్ సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డెన్ సర్చులో భాగంగా 80 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, ఓ వ్యక్తిని అరెస్ట్ చేశామన్నారు. మండలంలో ఎక్కడైనా నాటుసారా తయారీ, విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడకూడదని, నిబంధనలకు విరుద్ధంగా అసాంఘీక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించక చట్టపరమైన చర్యలు చేపడుతామన్నారు. మండలంలో ఎక్కడైనా నాటుసారా తయారీ, విక్రయాలు జరిపితే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలు మానేసి జీవనోపాధి పనులు చూసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగేశ్వర రావు, క్రిష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



నాటుసారాను సీజ్ చేస్తున్న సిఐ పులిశేఖర్

## ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి :అభిషిక్త్ కిషోర్

**ప్రజాశక్తి-రాయచోటి**

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని, ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ జిల్లాస్థాయి ఇసుక కమిటీ సభ్యులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు జిల్లాలో ఉన్న అన్ని ఇసుక రీచ్ లను తనిఖీ చేసి ఎక్కడైనా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లేదా ఎక్కడైనా రీచ్ లలో మిషన్లు పెట్టి అక్రమంగా ఇసుక రవాణా చేస్తుంటే అట్టి వివరాలపై జిల్లా కలెక్టర్లకు ఈనెల 21 లోపు నివేదిక సమర్పించాలని మైనింగ్ శాఖ స్పెషల్ సెక్రటరీ ఆదేశాలను జారీ చేశారని చెప్పారు.. జిల్లా స్థాయి కమిటీ సభ్యులు మార్గదర్శకాలు మేరకు తరచు ఇసుక రీచ్ లను సందర్శించాల న్నారు. మండల స్థాయిలో కూడా తహశీల్దార్లు, ఆర్‌డిఒలు కూడా సిబ్బందిని నియమించి ఇసుక రీచ్‌లో నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. కమిటీలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంగా తనిఖీలు చేసి అక్రమ ఇసుక రవాణాన్ని అరికట్టేందుకు బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీచేశారు. సమావేశంలో జిల్లా మైనింగ్ అధికారి డి రవి ప్రసాద్, పోలీసు, రెవెన్యూ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బోర్డ్, ట్రాన్స్‌ఫోర్ట్ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న మహమ్మద్ అబ్దుల్ జహీర్

## క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలి

**ప్రజాశక్తి-నందలూరు**

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని రాజంపేట డిఎస్‌పి విఎన్‌కె.చైతన్య పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లిలోని జడ్‌పిహైస్కూల్ క్రీడా మైదానంలో నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్ హార్డ్ టెన్నిస్ బాల్ ఓపెన్ టు ఆల్ క్రికెట్ టోర్నమెంట్‌ను డిఎస్‌పి ప్రారంభించారు. ఉదయం ప్రెస్ లెవెన్స్, పోలీసు జట్టు మధ్య జరిగిన మ్యాచ్‌లో పోలీసు జట్టు విజయం సాధించింది. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ 49 పరుగులు చేయడంతో పాటు, రెండు వికెట్లను తీసి ఒక క్యాచ్ పట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి మ్యాన్‌ఆఫ్‌దిమ్యాచ్ ట్రోఫీని దక్కించుకున్నాడు. కార్యక్రమంలో పల్లె గ్రీష్మంతరెడ్డి ముమ్మడిశెట్టి సుధాకర్, పత్తి శంకర, శివకోటి, న్యాయవాది మోహన్ క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూము దృశ్యాలను పరిశీలిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

## ఇవిఎం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన 'కొరముట్ల'

**ప్రజాశక్తి-రైల్వేకోడూరు**

రాయచోటి శ్రీసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో భద్రపరిచిన కోడూరుకు సంబదించిన ఇవిఎం స్ట్రాంగ్ రూంను నిఘా కెమెరాల ద్వారా ప్రభుత్వ విప్ శాసనసభ్యుల కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి పరిశీలించారు. జూన్ 4న జరగబోయే ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

## పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత

**ప్రజాశక్తి-తంబళ్లపల్లె**

మండలంలో అమలవుతున్న ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే పనులు, పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎపిడి మధుబాబు తెలిపారు. బుధవారం స్త్రీశక్తి భవన్లో ఉపాధి హామీ ఎంటిఎలు,ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాలలో పండ్ల తోటల పెంపకం పై రైతులకు అవగాహన కల్పించి ఉపాధి హామీ పథకం ద్వారా వారికి పండ్ల తోటల పెంపకానికి పాడి రైతులకు పశువులకు గడ్డి పెంపకానికి సహకరించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లోకి వెళ్లి రైతుల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎక్కువమంది కూలీలు పాల్గొనే విధంగా చొరవ చూపాలన్నారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో పని చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. సమావేశంలో ఏపీవో అంచనప్ప పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

## బైక్‌ను ఢీ కొన్న కారు : డ్రైవర్‌పై కేసు నమోదు

**ప్రజాశక్తి-కలకడ**

రోడ్డు ప్రమాదంలో గాయపడిన చలపతి

ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక పోలీసులు తెలిపిన సమాచారం మేరకు..మండలంలోని కోన పంచాయితీ గంగిరెడ్డిగారిపల్లికి చెందిన మండెం చలపతి ద్విచక్ర వాహనంలో మందులు కొనేందుకు కలకడకు వచ్చినట్టు తెలి పారు. స్థానిక చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఉన్న హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద నుంచి ఇంటికి తిరిగి వెళుతుండగా రాయచోటి వైపు నుంచి కారు అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో చలపతికి తలకు, ముఖానికి, బలమైన రక్త గాయాలు కావడమే కాకుండా కుడికాలుపై కారు రెండు చక్రాలు వెళ్లడంతో మోకాలు క్రింది భాగం నుజ్జునుజ్జు అయ్యిందని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే విషయం తెలుసుకున్న బాధితుడి కుమారుడు మండెం .ప్రభుకుమార్, పోలీసులు అక్కడికి చేరుకుని 108 వాహనంలో పీలేరు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పీలేరులో ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం అక్కడి వైద్యులు సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని రుయాకు తరలించినట్లు చెప్పారు. చలపతి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

## బాలిక అదృశ్యంపై కేసు నమోదు

**ప్రజాశక్తి-ములకలచెరువు :** బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ములకలచెరువు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలానికి చెందిన మైనర్ బాలిక (17) ఈ నెల 4వ తేది నుంచి కనిపించడం లేదని తల్లిదండ్రులు అందజేసిన ఫిర్యాదులో తెలిపారని అన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

## 15 లీటర్లు నాటుసారా స్వాధీనం : వ్యక్తి అరెస్టు

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి :** నాటు సారా విక్రయించడానికి ప్రయ త్నిస్తున్న యువ కుడిని బుధ వారం నిమ్మనపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు హెడ్ కానిస్టేబుల్ శివ రామకృష్ణయ్య తెలిపారు. బుధవారం రాచవేటివారిపల్లెకు చెందిన పిల్లి రాజు (24) రాచవేటివారి పల్లె సమీపంలోకి నాటుసారాను తీసుకువచ్చి విక్రయించడానికి ప్రయ త్నిస్తుండగా, అదే సమయంలో గస్తీలో ఉన్న పోలీసులు అటు రావడాన్ని గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతని వద్ద నుంచి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు హెడ్ కానిస్టేబుల్ శివరామకృష్ణయ్య తెలిపారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ రాజేష్, హరినాథ్ పాల్గొన్నారు.



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు